క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం


విజేతలకు బహుమతులు అందిస్తున్న రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనీల్‌కుమార్

రాపూరు : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని రాపూరు డిపో మేనేజర్ అనీల్‌కుమార్ తెలిపారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు రోడ్డులో ప్రయాణించే వారి టికెట్లను లక్కీ డిప్ తీసి విజేతలను ఎంపిక చేశారు. వారికి సోమవారం బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నామని, విద్యార్థుల తల్లితండ్రులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. రాపూరు –గూడూరు, రాపూరు–వెంకటగిరి రోడ్లలో ప్రయాణించే వారు బస్సు దిగేటప్పుడు టికెట్‌పై ఫోన్ నంబర్, అడ్రస్ రాసి బాక్సులో వేయాలని, వాటిని 15 రోజులకు ఒకసారి లక్కిడిప్ తీసి నలుగురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీఐ బషీర్‌అహ్మద్, సిబ్బంది సుందరయ్య, పీజీ బాషా, విజేతలు మోనిక, ఇందిర, కిష్టయ్య, గిరి పాల్గొన్నారు.

దుగరాజపట్నం పోర్టును సాధించి తీరుతాం



మాట్లాడుతున్న చింతా మోహన్

కోట: దుగరాజపట్నం అంతర్జాతీయ పోర్టు కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తామని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ తెలిపారు. ఆయన సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి కోట గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దుగరాజపట్నంలో ఓడరేవు నిర్మాణం అనేది రాష్ట్ర విభజన చట్టంలో తొలి హామీ అన్నారు. దుగరాజపట్నం పోర్టుకు ప్రధాన అడ్డంకి చంద్రబాబునాయుడేనని ఆరోపించారు. క్రిష్ణపట్నం పోర్టును కాపాడేందుకు దుగరాజపట్నం పోర్టు రాకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పోర్టు నిర్మాణం పూర్తికావాలన్నారు. డాక్టర్ రామక్రిష్ణారావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

రాపూరు : పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని, పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ దినచర్యగా మార్చుకోవాలని నవాబుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు యమున, రాపూరు గ్రంథాలయాధికారిణి ధనమ్మ, సహాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పైపులైను గుంతలో ఇరుక్కుపోయిన లారీ



ఓజిలి: మండలంలోని పాతవెంకటగిరి రోడ్డు నుంచి వరదారెడ్డికండ్రిగకు వెళ్లే రోడ్డులో సోమవారం తాగునీటి పైపులైను గుంతలో లారీ ఇరుక్కుపోయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్వర్ణముఖి నది నుంచి కర్రబల్లవోలుకు తాగునీటి పైపులైను వేసేందుకు నెల క్రితం కాలువ తవ్వారు. దాన్ని పూర్తిస్థాయిలో పూడ్చలేదు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్డు బురదమయమైంది. ఈ క్రమంలో వెంకటగిరికి వెళ్తున్న లారీ పైపులైను గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

చిల్లకూరు : మండలంలోని ఓడూరులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాలు.. ఓడూరు గిరిజన కాలనీకి చెందిన మునిరత్నం (53) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. తర్వాత ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లేదు. ఈ క్రమంలో సోమవారం కాలనీకి సమీపంలో ఉన్న నీటి గుంత వద్ద చెప్పులు కనిపించాయి. మధ్యాహ్నం మృతదేహం తేలియాడడంతో కుటుంబ సభ్యులు గుర్తించి ఇంటికి తీసుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

మృతుని ఆచూకీ లభ్యం

వాకాడు: మండలంలోని దుగరాజపట్నం కొత్తూరు సమీపంలోని చెట్ల మధ్యలో ఆదివారం యువకుడి మృతదేహాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. మృతుడు గూడూరుకు చెందిన కొండా ఉదయ్‌కుమార్‌రెడ్డి కుమారుడు అనిత్‌రెడ్డి(25)గా తేలిందని ఎస్‌ఐ నాగబాబు సోమవారం చెప్పారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలు త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

మార్కెట్టు ప్రాంతంలో అడ్డదిడ్డంగా నడుస్తున్న వాహనాలు



సంగం థియేటర్ కూడలి వద్ద నిలిచిపోయిన వాహనాలు



ట్రాఫిక్ పద్మవ్యూహం

- ఎక్కడపడితే అక్కడ వాహనాల నిలుపుదల
- రోడ్డుపైనే దుకాణాలు
- నిరంతరం ఆగిపోతున్న వాహనాల రాకపోకలు
- పట్టించుకోని పోలీసులు

అదిపెద్ద నిమ్మకాయల మార్కెట్ ఉండడంతోపాటు రైల్వే జంక్షన్ కావడంతో గూడూరు వ్యాపార, వాణిజ్య కేంద్రంగా మారింది. దీంతో పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. గ్రామాల నుంచి ఎక్కువ మంది ఇక్కడికి వచ్చి స్థిర నివాసం ఉంటున్నారు. జనాభాతోపాటు వాహనాల సంఖ్య కూడా పెరిగింది. ప్రతి రోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వ్యాపారులు రోడ్లను ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటుచేసుకోవడం, ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు నెల మామూళ్లు తీసుకుని రోడ్ల ఆక్రమణలపై దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చిల్లకూరు : గూడూరు పట్టణం ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇక్కడ సుమారు 1.25 లక్షల జనాభా ఉంది. ప్రతిరోజూ కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు సుమారు 10 వేల మంది వరకు వస్తుంటారు. ఆటోలు సుమారు 4,500, ద్విచక్ర వాహనాలు 20 వేలు, లగేజీ ఆటోలు, వాహనాలు సుమారు 500లకు పైగా ఉన్నాయి. ఇది రైల్వే జంక్షన్ కావడంతోపాటు అతిపెద్ద నిమ్మకాయల మార్కెట్ ఉండడం, సబ్ కలెక్టర్ కార్యాలయం ఉండడంతో నిరంతరం ఇతర ప్రాంతాల నుంచి సుమారు 2 వేలకు పైగా వాహనాలు వచ్చి వెళుతుంటాయి. దీంతో పట్టణంలో నిరంతరం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా గూడూరు పాత బస్టాండ్‌లో పండ్ల దుకాణదారులు నాలుగు చక్రాల వాహనాలను రోడ్డుపై ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు. ఒక వైపు ఆటో స్టాండ్, మరో వైపు నాలుగు చక్రాల వాహనాలు ఉండడంతో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడానికి ఇబ్బందిగా మారుతోంది. అలాగే మార్కెట్టు సెంటర్‌లో రోడ్డుపైనే వ్యాపారులు సరుకులు విక్రయిస్తున్నారు. దీనికితోడు ద్విచక్ర వాహనాలను రోడ్డులో అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీంతో కుమ్మరవీధి, కొత్త బస్టాండ్ నుంచి వచ్చే వాహనాలు, ఐసీఎస్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు మార్కెట్టు ఏరియాలో నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసే కానిస్టేబుళ్లు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. అలాగే సంగం థియేటర్ ప్రాంతంలో మలుపు వద్ద వాహనాలు ఎదురెదురు వస్తే అరగంటకు పైగా నిలిచి పోవాల్సి వస్తుంది. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసినప్పటికీ వారు రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసే వారిని ఏమీ అనలేని పరిస్థితి. అడిగితే మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తున్నామని వాగ్వాదానికి దిగుతున్నారు. గూడూరు పట్టణంలో నుంచి రెండవ పట్టణంలోకి వెళ్లేందుకు కూడా ఒకటే మార్గం ఉండడంతో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ నిలిచిపోతోంది. పోలీసులు ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించి వ్యాపారులు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని, నాలుగు చక్రాల వాహనాల్లో పండ్ల వ్యాపారాలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తయ్యేదెన్నడో..

గూడూరు ఒకటి, రెండు పట్టణాలను కలుపుతూ ఐసీఎస్ రోడ్డు వద్ద రైల్వే లైనుపై ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో మంజూరైంది. 2011లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు, స్థలాలకు పరిహారం ఇవ్వలేదని బాధితులు కోర్టుకు వెళ్లడంతో కొన్ని సంవత్సరాలు పనులు ఆలస్యమయ్యాయి. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం బ్రిడ్జి గురించి పట్టించుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి టెండర్లను పెంచి పనులు అప్పగించింది. అప్పట్లో పనులు చురుగ్గా జరిగాయి. 2024లో ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. సుమారు 2 కీమీ మేర ఉన్న ఆర్‌వో బ్రిడ్జి పనులు పూర్తయితే పెద్ద, వాహనాలు బ్రిడ్జిపై వెళితే పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తొలగే అవకాశం ఉంది.


టవర్‌క్లాక్ ప్రాంతంలో రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్న దుకాణదారులు

> **ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపడుతున్నాం**
> వ్యాపారులతో పాటు ఆటోలు, నాలుగు చక్రాల వాహనాల చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. గూడూరు పట్టణంలో వాహనాల సంఖ్య పెరిగిపోయింది. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మార్గం ఒక్కటే కావడంతో సమస్య జటిలమౌతోంది. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతాం.
> – శేఖర్‌బాబు, ఒకటో పట్టణ సీఐ, గూడూరు

మాజీ ఉపసర్పంచి మృతికి నేదురుమల్లి సంతాపం

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచి కుంబాల మస్తానయ్య(89) సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకున్నారు. మస్తానయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, నేదురుమల్లి శ్రీధర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, కుంబాల కోటయ్య ఉన్నారు.


మస్తానయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నా భూమిపై మరొకరికి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారు

– ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన బాధితుడు

సూళ్లూరుపేట రూరల్ : తన పేరుతో ఉన్న పొలాన్ని రెవెన్యూ అధికారులు మరొకరి పేరుతో పట్టదారు పాస్ పుస్తకం ఇచ్చారని సూళ్లూరుపేట మండలం గోపాల్‌రెడ్డి పాళెంకు చెందిన తుమ్మ తిరుపాల్ వాపోయాడు. ఆయన సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆర్డీవో కిరణ్మయికి ఫిర్యాదు చేశారు. తడ మండలం కారిజాత రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 8–4లో 0.55 సెంట్ల భూమిని తన తల్లిదండ్రులు 1961లో కొనుగోలు చేశారని తెలిపారు. 2019లో అప్పటి తహసీల్దార్ అదే గ్రామానికి చెందిన దువ్వూరు మునిబాబురెడ్డి పేరుతో వన్‌బీ చేసి పట్టదారు పాసు పుస్తకం ఇచ్చారని వాపోయారు. దీనిపై పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పైగా తనపైనే కేసు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

గూడూరు రూరల్/చిల్లకూరు/వెంకటగిరి రూరల్ : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. వారు సోమవారం గూడూరు, చిల్లకూరు, వెంకటగిరి పట్టణాల్లోని వార్డు సచివాలయాల ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇళ్లు కట్టుకునే పేదలకు అవసరమైన ఇసుక, ఇనుప కమ్మీ, సిమెంటు ఉచితంగా ఇవ్వాలని కోరారు. మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గూడూరులో శశికుమార్, కాలేషా, ఎంబేటి చంద్రయ్య, సుబ్రమణ్యం, అంకయ్య, యాకోబు, చిల్లకూరులో సీహెచ్ ప్రభాకర్, వెంకటగిరిలో బాలకృష్ణయ్య, కచ్చేపల్లి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ

నాయుడుపేట టౌన్ : ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి కుమారుడు, టీఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత తంబిరెడ్డి మోహన్‌రెడ్డి జన్మదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మారంరెడ్డి ముత్యాలరెడ్డి, సాయి రెడ్డి, చంద్రశేఖర్ ఆర్టీసీ రూరల్ బస్టాండు వద్ద పేదలకు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. దారా రవి, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఈదా రత్నశ్రీ, ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, కౌన్సిలర్లు షేక్ షబ్బీర్, నారాయణ రెడ్డి, చంద్రమౌళి రెడ్డి పాల్గొన్నారు.


బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న నాయకులు

డివైడర్‌ను ఢీకొన్న తహసీల్దార్ కారు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట తహసీల్దారు ఎం.రాజేంద్ర ప్రయాణిస్తున్న కారు ఒంగోలు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. విజయవాడ కోర్టుకు హాజరయ్యేందుకు తహసీల్దార్ రాజేంద్ర ఆదివారం రాత్రి కారులో బయలుదేరారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, వీఆర్వో శివ ఉన్నారు. ఒంగోలు దాటిన తర్వాత కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్, శివ, డ్రైవర్ గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. తహసీల్దార్ రాజేంద్రకు ఎటువంటి గాయాలు కాలేదు.

22న మద్యం దుకాణాల్లోని సామగ్రి వేలం

గూడూరు రూరల్ : గతంలో నిర్వహించిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సామగ్రిని ఈ నెల 22న ఓజిలిలోని మద్యం డిపో వద్ద వేలం వేయనున్నట్టు డిపో మేనేజర్ శ్రీధర్‌బాబు తెలిపారు. ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్లు, క్యాస్ చెస్ట్‌లు, స్కానర్లు, క్యాష్ కౌంటింగ్ మెషిన్లు ఉన్నాయని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు ముందుగా డిపాజిట్ చేయాలని సూచించారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

చిల్లకూరు : ఆత్మహత్యకు యత్నించిన వివాహిత చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. చిల్లకూరుకు చెందిన సాయి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య శైలజ(20) చిన్న వివాదంతో రెండు రోజుల క్రితం ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

చిల్లకూరు : మండలంలోని క్రిష్టాపురం గిరిజన కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. బాలిక ఆదివారం ఇంటి నుంచి వెళ్లింది. సోమవారం సాయంత్రం వరకు పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో తల్లిదండ్రులతోపాటు బంధువులు ఆందోళన చెందుతున్నారు. తమ బిడ్డను సమీప బంధువులో ఓ వ్యక్తి కిడ్నాప్ చేసి ఉంటాడని ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు వివరణ ఇస్తూ ఎస్‌ఐ సురేష్‌బాబు ఓ వివాహిత మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు వెళ్లారని, ఆయన వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

నాయుడుపేట టౌన్ : మండలంలోని మేనకూరు గ్రామ ఎస్సీకాలనీ బస్టాప్ సమీపంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారంతో సోమవారం రాత్రి దాడి చేశామని పేర్కొన్నారు. చిట్టమూరు మహేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

కండలేరులో 51.938 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 51.938 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1,800 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,150, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ


సైదాపురం: సిద్ధలయ్య కోనకు మెట్ల మార్గంలో వెళుతున్న భక్తులు


రాపూరులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


సైదాపురం : సిద్ధలయ్య కోనలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాంలో వెలసిన కామాక్షిదేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశ మహారుద్రాభిషేకం, సహస్ర నామార్చన చేశారు. సాయంత్రం మహిళలు పిండి దీపాలు వెలిగించారు.

సిద్ధలయ్య కోనలో..

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని సిద్ధలయ్య కోన కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. జి ల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మహిళలు దీపా లు వెలిగించారు. శ్రీనవకోటి, నవనాథుల సిద్ధలయ్య, వారి ప్రియశిష్యుడు సారంగధరుడిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. కోర్కెలు తీరిన వారు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నా రు. మహిళలు గర్భ గుడిలో వరపడ్డారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ క్రాంతికుమార్ 20 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

దక్కిలిలో..

దక్కిలి : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలోని స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయానికి కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామికి ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. మహిళలు ఉసిరి చెట్ల కింద, ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు పొంగళ్లు పెట్టారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు.

రామనాథేశ్వరస్వామి ఆలయంలో..

రాపూరు: మండల కేంద్రమైన రాపూరులోని రామనాథేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం మూడో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు రామనాథేశ్వరశర్మ ఆకాశ దీపాన్ని వెలిగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు.


దక్కిలి: స్తంభాలగిరీశ్వరయ్య స్వామి దర్శనానికి వెళుతున్న భక్తులు

సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి నూతన కమిటీ ఎన్నిక

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి నూతన కమిటీని ఆదివారం రాత్రి సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో చైర్మన్‌గా బి డేనియల్ చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా జాలాదికిషోర్, సెక్రటరీగా బి రాజ్‌కుమార్, ట్రెజరర్‌గా ఎస్ సాల్మన్, సభ్యులుగా అబ్రహం, భాస్కర్, రాజీవ్ ఎన్నికయ్యారని సంఘ కాపరి ఎన్ ప్రశాంత్‌బాబు తెలిపారు.

ఎట్టకేలకు ఆర్టీసీ బస్సుల నిలుపుదల

తడ: ఎట్టకేలకు తమిళనాడు సరిహద్దులోని రామాపురం వద్ద బస్సులను నిలుపుతున్నారు. రామాపురం పంచాయతీతోపాటు పెరియవట్టు పంచాయతీలోని 8 గ్రామాల ప్రజలు రామాపురం బస్టాప్‌లో బస్సులు ఎక్కుతూ ఉంటారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కిలివేటి సంజీవయ్య చొరవ తీసుకుని రామాపురం వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయించారు. ఏపీ ఎస్‌ఆర్టీసీ బస్సులతోపాటు తమిళనాడు బస్సులు కూడా ఆగేవి. కొద్ది రోజులుగా ఇక్కడ బస్సులు నిలపడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో స్థానికులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు తమ ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఆయన ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం సూళ్లూరుపేట డిపో సిబ్బంది రామాపురం చేరుకుని బస్సులు నిలిపేలా చర్యలు తీసుకున్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

వెంకటగిరి(సైదాపురం) : బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరి తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో సోమవారం మహిళా సాధికారతపై బా లికలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వాలు కూడా రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయురాలు త్రివేణి, గ్రంథాలయ అధికారి అంజయ్య, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో గ్రంథాలయ వారోత్సవాలు

సూళ్లూరుపేట : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని బ్రహ్మప్రకాష్ హాలులో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. తిరుపతి ఐఐటీ డిప్యూటీ లైబ్రేరియన్ ప్రశాంతకుమార్ బెహర ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పుస్తకాలు మనకు మంచి నేస్తాలన్నారు. పుస్తక పఠనం ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తాయని వెల్లడించారు. పుస్తకాలు చదవి జ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.